

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

రాజమహేంద్రవరం | సోమవారం 18 మే 2026 | I


# దొంగతనాలు హెల్మెట్ వాడకంపై అవగాహన సదస్సు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, మే 17 (ప్రభాతవార్త):** కాకినాడ జిల్లా పెద్దాపురం పోలీస్ వారి ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో రోడ్డు ప్రమాదాలు,దొంగతనాలు నివారణ,హెల్మెట్ ధారణపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం ఎస్డిపిఓ ఎబిజి తిలక్,పెద్దాపురం శాసన సభ్యులు నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి చైర్మన్ , జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి బాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మకాయల రంగనాథ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో డిఎస్పి తిలక్ మాట్లాడుతూ హెల్మెట్ యొక్క ఆవశ్యకతను అవగాహన కల్పించారు. మోటార్ సైకిల్స్ నడిపే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని, ట్రిపుల్ రైడింగ్ , బైక్ స్టంట్స్ , మైనర్ డ్రైవింగ్ చేయరాదని, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి అనే నినాదంతో పోలీసులకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ సమావేశంలో సీఐ వై ఆర్ కే శ్రీనివాస్, పారిశ్రామిక వేత్తలు, పోలీసు అధికారులు, పట్టణ ప్రజలు , మోటార్ ఫీల్డ్ లో ఉండే ఆటో డ్రైవర్లు,లారీ డ్రైవర్లు మహిళలు పాల్గొన్నారు.

# క్రీడల్లో జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలి

## జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం కలెక్టరేట్, మే 18 ప్రభాతవార్త** స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ (శాఫ్) మరియు జిల్లా యంత్రాంగం సంయుక్తంగా సమకూర్చిన క్రీడా సామాగ్రిని సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణతో కూడిన శిక్షణ పొంది యువ క్రీడాకారులు భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయిలో పతకాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ యువ క్రీడాకారులకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జిఎంసి బాలయోగి స్టేడియం నందు శాప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ క్యాంపు- 2026లో భాగంగా 8 నుండి 16 సంవత్సరాలు వయసు కలిగిన యువ క్రీడాకారులకు క్రీడాసామగ్రిని జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తిగా విజయవంతంగా నిర్వహిస్తున్న 60 వేసవి శిక్షణ శిబిరాలకుగాను ఈ మెటీరియల్‌ను అందజేశామన్నారు. జిల్లాలోని 8 నుండి 16 సంవత్సరాల వయసు కలిగిన యువ క్రీడాకారుల్లోని నైపుణ్యాలను ప్రతిభను వెలికితీసేందుకు ఈ వేసవి శిక్షణ శిబిరాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. జిల్లాలో మొత్తం 60 క్యాంపులను ఏర్పాటు చేశామని, వీటికి కావాల్సిన క్రీడా సామగ్రిలో కొంత భాగాన్ని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్ ) సమకూర్చగా, మిగిలిన స్పోర్ట్స్ మెటీరియల్ ను కలెక్టర్ నిధులుద్వారా ప్రత్యేకంగా సేకరించి బాస్కెట్ బాల్, స్కేటింగ్, వెయిట్ లిఫ్టింగ్, టైక్వాండో మరియు ఫుట్‌బాల్ క్రీడలకు సంబంధించిన నాణ్యమైన క్రీడా సామాగ్రిని క్రీడాకారులకు ఇబ్బంది లేకుండా ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. వేసవి సెలవుల్లో క్రీడా కారులకు మెరుగైన శిక్షణ, శారీరక దారుఢ్యం మెరుగు పరుచుకోవాలన్నారు?. శిక్షకులు కూడా క్రీడాకారులకు నాణ్యమైన శిక్షణ అందించాలని ఆదేశించారు . ఈ పంపిణీ కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి రుద్ర, ఎస్జిఎఫ్ కార్యదర్శి కె ఈశ్వరరావు, మహిళా కార్యదర్శి రమాదేవి సీనియర్ వ్యాయామ సంచాలకులు ఫణీంద్ర వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, కోచ్‌లు, క్రీడాకారుల తల్లిదండ్రులు మరియు పెద్ద సంఖ్యలో బాలబాలికలు, యువ క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఏ కుటుంబాన్ని వెలి వేయలేదు. తోటపేట గ్రామ పెద్దలు.



**తాళ్ళరేవు, మే 17 (ప్రభాతవార్త)-** కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పోలేకుర్రు పంచాయితీ తోటపేట గ్రామంలో 43 కుటుంబాలను వెలివేసారని పత్రికలలో వచ్చిన వార్తలను తోటపేట గ్రామ పెద్దలు, గ్రామంలోని పలువురు ప్రజలు ఖండించారు. ఈ సందర్భంగా తోటపేట రామాలయం వద్ద స్థానిక ప్రజలతో కలిసి పెద్దలు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ మేరకు పెద్దలు రేవు భద్రయ్య, దడాల బాలరాజు, ఊడా శుభాకరరావు విలేకరులతో మాట్లాడారు. గ్రామంలోని ఇద్దరికి చెందిన స్థలానికి దారి కోసం వివాదం జరిగిందని అన్నారు. అంతే తప్ప ఏ కుటుంబాన్ని మేము వెలి వేయలేదని తెలిపారు.

# భక్త జనసంద్రం..లోవ శ్రీ తలుపులమ్మ క్షేత్రం..



**తుని,మే17,( ప్రభాతవార్త )** రాష్ట్రంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న తుని మండలం లోవ శ్రీ తలుపులమ్మ అమ్మవారి దేవస్థానం ఆదివారం భక్త జనసంద్రంగా మారింది. వేకువ జాము నుండి శ్రీ తలుపులమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకములు నిర్వహించారు. అనంతరం పలురకాల పుష్పాలతో అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించిన అర్చక స్వాములు భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించి తరించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈవో పెన్మత్స విశ్వనాథరాజు మాట్లాడుతూ సుమారు 28వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించారన్నారు. ప్రసాదాలు విక్రయం,పూజ టికెట్లు, కాటేజీలు తదితర విభాగాల ద్వారా ఆదివారం ఒక్క రోజులో 8లక్షల రూపాయల ఆదాయం అమ్మవారికి సమకూరినట్లు తెలిపారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈవో విశ్వనాథరాజు ఆధ్వర్యంలో దేవస్థాన సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# వాడపల్లి నిత్యాన్నదాన పథకానికి రూ 1,00,116 విరాళం...

## నిత్యకళ్యాణం, అష్టోత్తర పూజలలో పాల్గొన్న భక్తులు







**ఆత్రేయపురం, మే ,17,(ప్రభాత వార్త).** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయానికి ఆదివారం కావడంతో అశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం మేలుకొలుపు, శ్రీలక్ష్మి వెంకటేశ్వర ఐశ్వర్య హోమం,అష్టోత్తర శతనామావళి, నిత్యకళ్యాణం,గోపూజ, తదితర కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. అనంతరం శ్రీ స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. అనకాపల్లి జిల్లా, డి-యర్రవరం మండలం, నాతవరం చెందిన చి.అద్వైథి చౌదరి,చి.చెన్నూపాటి కార్తీక, వారి కుటుంబ సభ్యులు నిత్యాన్నదాన పథకానికి రూ. 1,00,116/- విరాళంగా అందించారు. స్వామివారి దర్శనం అనంతరం వారికి ఆలయ అర్చకులు వేద పండితులు, వేద ఆశీర్వచనం అందించగా. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు లు శ్రీ స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు, అందజేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అధికారులు తగు ఏర్పాట్లు చేశారు.

# ఆలోచింపచేసిన"అమ్మ చెక్కిన బొమ్మ " నాటిక





**అనపర్తి మే 17 ( ప్రభాతవార్త )** నల్లమిల్లి మూలారెడ్డి కళాపరిషత్ 37 వ జాతీయస్థాయి నాటికల పోటీలు ముగింపు రోజున ప్రదర్శించిన గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్ వారి అమ్మ చెక్కిన బొమ్మ నాటిక ప్రదర్శన చక్కటి సందేశం తో సాగింది. సృష్టిలో ఉత్తమమైనది మానవజన్మ. ఈ మానవ జన్మలో స్త్రీ పురుషుల గురించే మనం మాట్లాడుకుంటూ ఉంటాం. పురాణ కాలము నుండి నేటి వరకు,ఆదిమానవ యుగంనుండి ఇప్పటి వరకు స్త్రీ, పురుషులే కాకుండా మానవ జాతిలో దాదాపు 20 రకాల శరీర తత్వాలు కలిగిన మనుసులు ఉన్నారని ఎంత మందికి తెలుసు? వాళ్ళు స్త్రీలను లేదా పురుషులను మాత్రమే గౌరవించే ఈ బూటకపు నాగరికతలో అలా మన గ లుగుతున్నారు అలాంటి వాళ్లకు ఎటువంటి గౌరవం గుర్తింపుఉంది? అసలు ఈ ఆలోచన మనకు ఎప్పుడైనా కలిగిందా? అనే ప్రశ్నలతో సాగిన ఈ నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది. నాటికను జ్యోతిరాజ్ బీశెట్టి రచించగా, యాక్టర్ వెంకట్ గోవాడ దర్శకత్వం వహించారు. ఇందులో వెన్నెలగా కుమారి హర్షిని, శశి గా ధన్విన్,యశ్వంత్, అనసూయగా జ్యోతిరాజ్ భీశెట్టి, గోవర్ధనగా డాక్టర్ వెంకట్ గోవాడ, శేషు గా ఉదయకుమార్ సంతోష్, ఇతర పాత్రల్లో పణి నటించి ప్రేక్షకుల మన్ననలు పొందారు. నాటికకు యసంగీతం, గానం మువ్వ నాగరాజు , మేకప్ డాక్టర్ హారిక గోవాడ, సెట్,లైటింగ్ దివాకర్ ఫణీంద్ర,రోహిత్ సహకారం అందించారు.

# పాదగయను దర్శించుకున్న 20 సూత్రాల చైర్ పర్సన్



**యు.కొత్తపల్లి (పిఠాపురం), మే 17 (ప్రభాతవార్త) :** పాదగయను దర్శించుకునే భక్తులకు పూర్తి స్థాయిలో వసతులు, సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర 20 సూత్రాల కార్యక్రమ చైర్ పర్సన్ లంకా దినకర్ అన్నారు. ఆదివారం పిఠాపురంలోని పాదగయను సందర్శించి కుక్కుటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి, సహాయ కమీషనర్ కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ ఆలయ మర్యాదతో ఆయనకు స్వాగతం పలికారు. దత్తాత్రేయ స్వామి, రాజరాజేశ్వరి, పురుహూతికా అమ్మవార్లను దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి శేష వస్త్రాలు, చిత్రపటం అందచేశారు. పిఠాపురం అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్.శివరామప్రసాద్, తహసీల్దార్ పి. గోపాలకృష్ణ, సిబ్బందితో ఆలయ అభివృద్ధికి వనరులు, సౌకర్యాలు కల్పనపై సమీక్ష నిర్వహించారు.

# వార్డుల పునర్విభజన పై అభ్యంతరాలకు ఆహ్వానం

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,మే17,ప్రభాతవార్త** అమలాపురం పురపాలక సంఘం (మున్సిపాలిటీ) పరిధిలో ప్రస్తుతం ఉన్న 30 వార్డులను 36 వార్డులుగా పునర్విభజిస్తూ మున్సిపాల్ కమిషనర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ వార్డుల పునర్విభజన ప్రక్రియను చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ నిర్మల కుమార్ తెలిపారు.?మార్పులు చేసిన ఈ 36 వార్డుల సరిహద్దుల పూర్తి వివరాలను (ఫారం-1) ప్రజల సమాచారం నిమిత్తం స్థానిక మున్సిపల్ కార్యాలయం, జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఆర్డీఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం,సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం, అమలాపురం టౌన్ పోలీస్ స్టేషన్ మరియు సబ్ జైలు ఆఫీస్ నోటీస్ బోర్డులపై అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

**మే 24 లోగా అభ్యంతరాల సమర్పణకు గడువు**

ఈ వార్డుల పునర్విభజనపై అమలాపురం పట్టణ ప్రజలకు ఏవైనా అభ్యంతరాలు,సలహాలు లేదా సూచనలు ఉంటే ఈ నోటీసు ప్రచురించిన 7 రోజులలోగా,అనగా ఈనెల 24వ తేదీ సాయంత్రం 5:00 గంటల లోపు మున్సిపల్ కార్యాలయం లో లిఖితపూర్వకంగా అందజేయాలని కమిషనర్ కోరారు. నిర్ణీత గడువు ముగిసిన తర్వాత వచ్చే అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోబోమని ఆయన స్పష్టం చేశారు.

# భూమి ఆక్రమించి రోడ్డు వేసే యత్నం కులం పేరుతో దూషణ

## అధికారులు న్యాయం చేయాలని దళిత కుటుంబం వేడుకోలు




**కాట్రేనికోన, మే 17 (ప్రభాతవార్త):** తమకు చెందిన భూమిని ఆక్రమించి రోడ్డు వేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, దీనిని అడ్డుకుంటున్న తమపై కులం పేరుతో దూషిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని కాట్రేనికోన మండలం గెడ్డనపల్లికి చెందిన ఓ దళిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది.బాధితులు కాశి కృష్ణవేణి, వెంకటేశ్వరరావు దంపతులు తెలిపిన వివరాల ప్రకారం... వారు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తూ, కొన్నేళ్ల క్రితం దొంతికుర్రులో ఒక ఎకరం భూమిని కొనుగోలు చేశారు. ఇంతకాలం వరకు ఆ భూమికి సంబంధించి ఎటువంటి వివాదాలు లేవని తెలిపారు. ఇటీవల గ్రామంలో రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు శంకుస్థాపన చేసిన నుండి సమస్య మొదలైందన్నారు. తమ భూమి సరిహద్దులోని రెండు సెంట్ల భూమిని అమ్మిన వారికి దారి నిమిత్తం కేటాయించినప్పటికీ, అదే ప్రాంతంలో దొంతికుర్రుకు చెందిన ఓ ఆర్ఎంపి వైద్యుడు తమ భూమిని కూడా ఆక్రమించి రోడ్డు వేసేందుకు ప్రయత్నిస్తున్నాడని వారు ఆరోపించారు. స్థానికంగా ఉన్న కొందరు అగ్రకుల నాయకుల మద్దతుతో ఈ చర్యలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.ఈ భూమి మాదని, మిగిలిన భూముల్లో రోడ్డు వేసుకోవాలని మేము చెప్పినా వినకుండా వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారు. కులం పేరుతో అవమానిస్తూ మానసికంగా వేధిస్తున్నారు అని బాధితులు వాపోయారు.వివాదాస్పద భూమిపై సర్వేయర్ కొలతలు చేపట్టగా సుమారు నాలుగు సెంట్ల భూమి ఉన్నట్లు తేలిందన్నారు. అందులో ఆర్ఎంపి వైద్యుడి బంధువులకు చెందిన రెండు సెంట్లు మినహా మిగిలిన భూమి తమదేనని చెప్పారు. అయినప్పటికీ మొత్తం భూమిని ఆక్రమించి రోడ్డు వేయడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబం కోరింది. అవసరమైతే జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తామని వారు వెల్లడించారు.

# జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ క్రీడలో రికార్డుల ప్రభంజనం




**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిది,మే17,ప్రభాతవార్త.** అమలాపురంలోని సత్యనారాయణ గార్డెన్స్ నందు ఎం.పి జి.ఎం.హరీష్ బాలయోగి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 15వ జాతీయ స్థాయి సబ్ జూనియర్, జూనియర్ మెన్ అండ్ ఉమెన్స్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్‌లు ఉత్సాహంగా కొనసాగు తున్నాయి. దేశంలోని 29 రాష్ట్రాల నుంచి సుమారు 900 మంది క్రీడాకారులు పాల్గొంటూ తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. పోటీల 3 రోజుఉదయం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథుగా ఎమ్మెల్సీ బొమ్మి ఇస్రాయిల్ హాజరయ్యారు.యువత విద్యార్థులకు ఈ క్రీడలు చాలా ఉపయోగకరమని,జాతీయ స్థాయి,అంతర్జాతీయ స్థాయిల్లో తమ ప్రతిభను సాటడం వల్ల దేశానికి మన ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలతో పాటు జీవితంలో స్థిరపడగలరని పేర్కొన్నారు. అనంతరం మెన్ విభాగంలో 59, 66 కేజీల కేటగిరీలలో సబ్ జూనియర్ జూనియర్ లలో విజేతలైన క్రీడాకారులు, క్రీడాకారిణులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్ఆర్సిపి నాయకులు చెల్లిబోయిన శ్రీనివాసరావు, ఒంటెద్దు వెంకన్న నాయుడు, నేషనల్ పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ కే.సతీష్ కుమార్, గారపాటి చంద్రశేఖర్,దొమ్మేటి రాము,పప్పా ప్రభాత్, వెలగట్ల జగదీష్,పప్పుల శ్రీరామచంద్ర మూర్తి, దొమ్మేటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.పోటీల విజేతల వివరాలను ఆర్గనైజింగ్ సెక్రటరీ కంకిపాటి వెంకటేశ్వర రావు వెల్లడించారు.సాయంత్రం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా టిడిపి సెక్రెటరీ గంధం పల్లంరాజు హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడ పోటీలో పాల్గొనటం వలన క్రమశిక్షణ అలవాడి జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షతో లక్ష్యాలు నెరవేర్చుకోవడానికి ఈ క్రీడా పోటీలు పాల్గొనడం వలన యువతకు అలవాటు అవుతుందని వారు పేర్కొన్నారు.అనంతరం ఉమెన్స్ విభాగంలో 52 ,57 కేజీల కేటగిరీలలో సబ్ జూనియర్, జూనియర్ ల లో విజేతలైన క్రీడాకారులు, క్రీడాకారిణులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రముఖులను ఆర్గనైజర్లు సన్మానించారు.ఈ కార్యక్రమంలో చిక్కాల గణేష్, మోకా సుబ్బారావు,గనిశెట్టి అరవింద్,అడబాల సత్యనారాయణ, నల్ల పవన్ కుమార్,ఆసెట్టి ఆదిబాబు, ముత్యాల బాబి, వెలగట్ల జగదీష్ హాజరయ్యారు.

# కొలనులో 'కలువల కను'విందు



**యు.కొత్తపల్లి, మే 17 (ప్రభాతవార్త) :** ఒక్క కలువపూవును చూస్తేనే మనసులో ప్రశాంతత కలుగుతుంది. అదే వందలాది పద్మాలను ఒకేసారి చూస్తే ఆ క్షణం మనస్సులో ఏర్పడే ప్రశాంతతను వర్ణించతరమా. అటువంటి చిన్న కలువ కొలను కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి మండలం రమణక్కపేటలో ఒక రైతు తన పొలంలో తవ్వించుకున్న కొలనులో వందలాది కలువలు విరబూసి కనివిందు చేస్తున్నాయి.

# గోదావరిలో యువకుడు గల్లంతు

## ఆలయ అధికారుల పర్యవేక్షణ లోపం.



**దేవీపట్నం మే 17 ప్రభాతవార్త** :ఈ ఘటనతో గండి పోచమ్మ ఘాట్ వద్ద భక్తుల భద్రతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిరోజూ వందల సంఖ్యలో భక్తులు స్నానాలకు వచ్చే ఈ ప్రాంతంలో కనీస భద్రతా చర్యలు లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు మండిపడుతున్నారు. ప్రమాదకర ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడం, ఇనుప బ్యారికేడ్లు ఏర్పాటు చేయకపోవడం, లైఫ్ గార్డులు లేదా రక్షణ సిబ్బంది అందుబాటులో లేకపోవడం వల్లే ఈ ప్రాణ నష్టం జరిగిందని ఆరోపిస్తున్నారు. ప్రతి ఆదివారం పండుగ సమయంలో భారీగా భక్తులు తరలివస్తున్నప్పటికీ ఆలయ అధికారులు ఆదాయంపైనే దృష్టి పెట్టి భక్తుల భద్రతను విస్మరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. గతంలో కూడా ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నప్పటికీ అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇకనైనా జిల్లా అధికారులు స్పందించి ఘాట్ వద్ద శాశ్వత భద్రతా ఏర్పాట్లు చేయాలని, హెచ్చరిక బోర్డులు, లైఫ్ జాకెట్లు, రక్షణ బృందాలు ఏర్పాటు చేసి భక్తుల ప్రాణాలను కాపాడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# నేడు యథావిధిగా పీజీఆర్ఎస్



**అమలాపురం కలెక్టరేట్, మే17 ప్రభాతవార్త** నేడు జిల్లా కలెక్టరేట్ లో గోదావరి భవనం నందు ప్రతీ సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమం యధావిధిగా నిర్వహించబడునని, మీకోసం.పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెనల్ సిస్టం (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీఅర్ఎస్ ద్వారా ప్రజల నుంచి అర్జీల స్వీకరణ చేపడుతున్నట్లు తెలిపారు. మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. అదేవిధంగా డివిజనల్, మండలస్థాయిలో రెవెన్యూ క్లినిక్ లు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రజలు తమ రెవెన్యూ అర్జీలను ఈ క్లినిక్ ల్లో అందజేయాలని సూచించారు. అర్జీదారులు తమ అర్జీలను ఈ (మీకోసం.ఏపీ. జీవోవి.ఇన్) వెబ్సైట్ నందు కూడా నమోదు చేసుకోవచ్చని, నమోదైన అర్జీల స్థితి,సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100 కి నేరుగా కాల్ చేయవచ్చని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ సదరు ప్రకటన ద్వారా సూచించారు.

## జనగణన-2027 సర్వే తీరును


# పరిశీలించిన జాయింట్ డైరెక్టర్



**కాట్రేనికోన, మే 17 (ప్రభాతవార్త):** మండలంలోని కుండలేశ్వరం గ్రామంలో నిర్వహిస్తున్న జనగణన-2027 సర్వే ప్రక్రియను పరిశీలించేందుకు సెన్సస్ జాయింట్ డైరెక్టర్ జి.వి. చంద్రకళ ఆదివారం గ్రామాన్ని సందర్శించారు. ఆమెతో పాటు జిల్లా సెన్సస్ ఇన్చార్జి తరుణ్ హాట్కర్ హెచ్.ఎల్.బి. నెంబర్-43ను ఆకస్మికంగా తనిఖీ చేసి, ఎన్యుమరేటర్ నిర్వహిస్తున్న సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా సెన్సస్‌లో భాగమైన 33 ప్రశ్నలను ఇంటి యజమానులను ఏ విధంగా అడుగుతున్నారో ఎన్యుమరేటర్‌ను స్వయంగా ప్రశ్నించి తెలుసుకున్నారు. సర్వే నిర్వహణలో ఎన్యుమరేటర్ పాటిస్తున్న విధానంపై జాయింట్ డైరెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. సర్వే ప్రక్రియలో ఒక్క గణన గృహం కూడా మిగలకుండా పూర్తి పారదర్శకతతో, వేగవంతంగా పనులను పూర్తి చేయాలని ఎన్యుమరేటర్లకు ఆమె సూచించారు. స్థానిక ప్రజలతో మాట్లాడిన ఆమె, జనగణన వల్ల ప్రభుత్వ అభివృద్ధి పథకాలు నిలిచిపోతాయనే అపోహలు నమ్మవద్దని, సేకరించిన సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలోమండల సెన్సస్ సూపర్‌వైజర్ జె.వి.వి. సత్యనారాయణ, ఎన్యుమరేటర్లు వాండ్రపు రామకృష్ణ, గుత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పల్ల వెంకన్న నర్సరీలో

# జస్టిస్ సునీల్ శుక్రే,




**కడియం, మే 17 ( ప్రభాతవార్త)** కడియం పల్ల వెంకన్న నర్సరీని ముంబై హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, ప్రస్తుత మహారాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జస్టిస్ సునీల్ శుక్రే కుటుంబ సమేతంగా ఆదివారం సందర్శించారు. నర్సరీ ప్రాంగణానికి చేరుకున్న జస్టిస్ శుక్రే కు యువ రైతులు పల్ల వెంకటేష్, వినయ్‌లు అరుదైన బోన్సాయ్ మొక్కను అందజేసి ఘన స్వాగతం పలికారు. అలంకార మొక్కలు, అరుదైన స్వదేశీ--విదేశీ వృక్షజాతులు, పండ్ల మొక్కలు, ఔషధ వనరులు సహా వేలాది రకాల మొక్కలను పరిశీలించిన జస్టిస్ శుక్రే వాటి పెంపకం , నాణ్యతపై ప్రత్యేక ఆరా తీశారు. ఆధునిక నీటిపారుదల విధానాలు, గ్రీన్ హౌస్ నిర్వహణ, ఎగుమతుల కోసం ప్రత్యేకంగా మొక్కల పెంపకం వంటి అంశాలపై ఆసక్తిగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి పరిరక్షణలో నర్సరీల పాత్ర అత్యంత కీలకం అని , పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతున్న ఇలాంటి సంస్థలు మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని నర్సరీ అధినేత పల్ల సత్తిబాబు పేర్కొన్నారు.

# మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున కార్మిక శాఖ మంత్రి సుభాష్ ఆర్థిక సాయం

## బాధిత కుటుంబాలకు అండగా సత్యం ఫౌండేషన్



**కాకినాడ రూరల్, మే 17( ప్రభాతవార్త ):** కాకినాడ రూరల్ మండలం కొవ్వూరు సమీప బైపాస్ రోడ్డులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మహిళ ఉపాధి శ్రామికులు మృతి చెందడం అత్యంత బాధాకరమని, వారి కుటుంబాలకు శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ (ఎస్ఏఎఫ్), సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అండగా నిలుస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి, ఎస్ఏఎఫ్ వ్యవస్థాపకులు వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున మొత్తం రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. ముగ్గురు మహిళలకు ఎస్ ఏ ఎఫ్ ద్వారా, మరో మహిళకు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా 50,000 చొప్పున సహాయం అందజేస్తామన్నారు. మంత్రి సుభాష్ ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం ఎస్ఏఎఫ్ నాయకులు చొల్లంగి వేణుగోపాల్, గుత్తుల శ్రీనివాస్, కడలి శివ, టేకుమూడి శ్రీనివాస్, కొండా వినాయక్ , గీసాల శ్రీనివాస్, వాసంశెట్టి అంజిబాబు, అనసూరి సతీష్ తదితరులు చీడిగ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి సుభాష్ ప్రస్తుతం అందుబాటులో లేనందున ఆయన సూచనల మేరకు తాము వచ్చినట్లు తెలియజేశారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఓదార్చారు. ఈ సందర్భంగా ఎస్ఏఎఫ్ నాయకులు మాట్లాడుతూ పొట్టకూటి కోసం ఉపాధి పనులకు వెళ్లిన నిరుపేద మహిళలు లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో ప్రాణాలు కోల్పోవడం హృదయ విదారకమన్నారు. ఇదే ప్రమాదంలో గాయపడిన మరో ఇద్దరు ఉపాధి శ్రామికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి సుభాష్ వైద్యులను ఆదేశించినట్లు తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున అన్ని విధాల సహాయం అందేలా కృషి చేస్తామని మంత్రి సుభాష్ హామీ ఇచ్చారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి..



**గోపాలపురం మే 17, (ప్రభాతవార్త):** రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన గోపాలపురం శివారులోని జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. ఎస్సై వి.సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ జిల్లా, కిర్లంపూడి మండలం, బూరుగుపూడి గ్రామానికి చెందిన ఆరుగొల్లు వెంకటేశులు(39) అనే వ్యక్తి డ్రైవర్ గా పని చేస్తున్నాడు. రామచంద్రపురానికి చెందిన నారాయణమూర్తితో కలిసి బొలెరో వాహనంపై హైదరబాద్ వెళ్లి, తిరిగి రాజమండ్రికి వస్తుండగా.. గోపాలపురం వచ్చే సరికి గ్రామ శివారులోని ఓ జీడిగింజల ఫ్యాక్టరీ సమీపంలో ఎదురుగా వస్తున్న కేఎ56ఎ 0695 అనే నంబర్ గల లారీ ఎదురుగా, అతివేగంగా వచ్చి బొలెరో వాహనాన్ని బలంగా డీ కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ఆరోగొల్లు వెంకటేసులుకి తీవ్ర గాయాలు అయ్యి అక్కడికక్కడే మరణించాడని ఎస్సై తెలిపారు. అతనితో పాటు ఉన్న నారాయణ మూర్తి తీవ్రగాయలు పాలవడంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించినట్లు చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, పోస్ట్ మార్టం నిర్వహించినట్లు ఎస్సై సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు.

## ఇంజరం సర్పంచ్ గా

# ముద్దన ప్రసాద్ సేవలు ఆదర్శనీయం.




**తాళ్లరేవు, మే 17 (ప్రభాతవార్త)-** కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం ఇంజరం పంచాయతీ లో 2021 నుంచి 2026 వరకు సర్పంచ్ గా ముద్దన వెంకట శివరామ ప్రసాద్ చేసిన సేవలు ఆదర్శనీయమని పలువురు కొనియాడారు. అరటికాయలంక గ్రామంలో గ్రామ ప్రజలచే ఇంజరం సర్పంచ్ ముద్దన వెంకట శివరామ ప్రసాద్ కు ఆత్మీయ పౌర సన్మానం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు, గ్రామ ప్రజలు మాట్లాడారు. గ్రామంలో ఏ సమస్య ఉన్న ఆ సమస్య పరిష్కారం అయ్యేంతవరకు ప్రసాద్ కృషి చేసే వారని పలువురు అన్నారు. అరటికాయలంక గ్రామానికి వేసవిలో సాగునీటి ఎద్దడి లేకుండా చేసిన ఘనత ఆయనదే అన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రసాద్ ను దుస్సాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. విచ్చేసిన అతిధులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, వైకాపా నాయకులు చింతలపాటి శ్రీనివాసరాజు, కాదా గోవింద కుమార్, పెయ్యల కొండబాబు, పంచాయతీ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపీటీసీ కోరుకొండ కిరణకుమారి,చంటి, తదితరులు పాల్గొన్నారు.

# లొల్ల లాకులవద్ద హ్యాపీ సండే...



**ఆత్రేయపురం, మే ,17,(ప్రభాత వార్త).** పర్యాటకంగా మండలంలోని లొల్ల లాకులను తీర్చి దిద్దేందుకు ప్రతి ఆదివారం ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు ఆదేశాలతో హ్యాపీ సండే కార్యక్రమంలోభాగంగా ఈ ఆదివారం భరతనాట్యం, చిన్న పిల్లల ఓపెన్ టాలెంట్ డాన్స్ షో నిర్వహించారు . వారికి మండల టిడిపి పార్టీ అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణరాజు బాబు అభినందనలు తెలుపుతు కళాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూసంపూడి రమేష్ రాజు తోట రజిని మండల కూటమి నాయకులు, కార్యకర్తలు చిన్నారులు పాల్గొన్నారు.

# వెలి ఘటనపై 20 న శాంతి కమిటీ సమావేశం.

**తాళ్లరేవు మే 17 (ప్రభాతవార్త)** కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పోలేకుర్రు పంచాయితీ తోటపేట గ్రామంలో 43 కుటుంబాలను వెలివేశారని వచ్చిన వార్తలపై అధికారులు స్పందించారు. ఈ మేరకు తాళ్లరేవు తహసిల్దార్ కార్యాలయంలో ఇరు వర్గాలతో ఈనెల 20వ తేదీన శాంతి కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తాళ్ళరేవు రెవెన్యూ ఇన్స్పెక్టర్ జి. రామకృష్ణ తోటపేట గ్రామం విచ్చేసి గ్రామ పెద్దలకు ఈ సమాచారం తెలిపారు. ఇరు వర్గాలు సమావేశానికి తప్పక హాజరు కావాలన్నారు.

## పంట పొలాల్లో గుర్తుతెలియని

# మృతదేహం లభ్యం...

**ఆత్రేయపురం, మే ,17,(ప్రభాత వార్త).** మండలంలోని వద్దిపర్రు పంట పొలాల్లో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు సమయంలో వద్దిపర్రు గ్రామం నందు గల పంట పొలాల్లో ఉర్రింకల వీర రాఘవులు కంద తోట లో సుమారు 50 నుంచి 55 సంవత్సరాల వయసు కలిగిన గుర్తుతెలియని పురుషుని మృతదేహం గుర్తించి స్థానిక వీఆర్వో ఇచ్చిన రిపోర్టుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్ రాము తెలిపారు. మృతుని వివరాలు మృతుడు ఎత్తు సుమారు 5 అడుగుల 6 అంగుళాలు బక్క పలుచగాను ఉండి శవం పాడైపోయి ఉన్నది . మృతుని వివరాలు ఎవరికైనా తెలిసిన యెడల ఆత్రేయపురం పోలీస్ స్టేషన్ నందు సంప్రదించాలని ఆయన తెలిపారు.

# యువగళం స్ఫూర్తికి నాంది

## ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్, ఎమ్మెల్సీ పి. రాజశేఖర్:




**జగ్గంపేట మే 17 (ప్రభాతవార్త)** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మానవ వనరుల అభివృద్ధి, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి వర్యులు నారా లోకేష్ చేపట్టనున్న రచ్చబండ కార్యక్రమం జగ్గంపేట మండలం రాజపూడిలో అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిస్థాయిలో జరుగుతున్నాయి. ఈ కార్యక్రమం యొక్క ప్రతి అంశాన్ని స్వయంగా పర్యవేక్షిస్తున్న జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ శ్రేణులను సమన్వయం చేస్తూ కార్యక్రమాన్ని ప్రజలకు చేరువ చేసే దిశగా కృషి చేస్తున్నారు. అదేవిధంగా, శాసనమండలి సభ్యులు పేరాబత్తుల రాజశేఖర్ ఏర్పాట్లలో చురుగ్గా పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ రచ్చబండ ద్వారా ప్రజల సమస్యలను నేరుగా విని, వాటి పరిష్కారానికి మార్గం సుగమం చేసేందుకు నారా లోకేష్ రానున్నారు. ప్రజలతో మమేకమయ్యే ఈ వేదిక, గ్రామీణ స్థాయిలో పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి మరో అడుగుగా నిలుస్తుంది అని అన్నారు. జిల్లా నాయకత్వం, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై ఈ కార్యక్రమాలన్నీ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు .

# అవాంఛనీయ సంఘటనలు ఏమీ జరగలేదు

## వేలాది మంది భక్తులు తైలాభిషేకములు

## ఆలయ కార్య నిర్వహణ అధికారి సురేష్ బాబు



**కొత్తపేట, మే 17,(ప్రభాతవార్త)** శనీశ్వరుని జయంతి శని అమావాస్య ను పురస్కరించుకుని శనివారం భక్తులకు అవాంఛనీయ సంఘటనలు ఏమి జరగలేదని అందరూ భక్తితో తైలాభిషేకములు నిర్వహించారని ఆలయ కార్యనిర్వాహణాధికారి దారపు రెడ్డి సురేష్ బాబు తెలిపారు మండల పరిధిలోని పురాణ ప్రసిద్ధిగాంచిన మందపల్లి శ్రీ ఉమామ మందేశ్వర (శనీశ్వర) స్వామి వారి ఆలయంలో ఆదివారం ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహించారు సమావేశంలో కార్యనిర్వహణాధికారి సురేష్ బాబు మాట్లాడుతూ శని జయంతి కార్యక్రమం దేవస్థానంలో ప్రప్రదంగా జరిగిందని అంతేకాకుండా ఆలయ ప్రాంగణంలో తైలాభిషేక భవనం అన్నదాన మండపం నిర్మాణాలు జరుగుతున్నాయని దాని మూలంగా భక్తులు అభిషేకాలు చేసుకునేందుకు స్థలాభావం నెలకొందని అన్నారు భక్తులు అంచనాకు నుంచి వచ్చినందుకు కూడా భక్తుల రద్దీ పెరిగిందన్నారు అలాగైనా దేవస్థానం పోలీస్ సిబ్బంది ధర్మకర్తల మండల సభ్యులు సహకారంతో సేవలు నిర్వహించామన్నారు కొందరు దేవస్థానంపై బురద జల్లే ప్రయత్నం చేసారన్నారు వచ్చేనెల 13 27 తేదీలలో వచ్చే శని త్రయోదశి పర్వదినాల్లో హైస్కూల్ గ్రౌండ్ కూడా తీసుకొని భక్తులకు అసౌకర్యాలు జరగకుండా సేవలు అందిస్తామని సురేష్ బాబు తెలిపారు

## భర్త వేధింపులు తాళలేక

# నిండు గర్భిణీ ఆత్మహత్య



**కూనవరం, మే 17, ప్రభాతవార్త:** భర్త వేధింపులు తాళలేక నిండు గర్భిణీ ఆత్మహత్యకు పాల్పడిన విషాద సంఘటన ఇది. ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.. పోలవరం జిల్లా కూనవరం మండలం టేకుల బోరు గ్రామంలో బొడ్డు సంధ్య (27) 8 నెలల గర్భిణి. ఈ యువతి తన ఇంట్లో చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. 7 సంవత్సరాల క్రితం మృతి చెందిన యువతి బొడ్డు అఖిల్ తో వివాహం జరిగింది. వీరికి ఒక అబ్బాయి. గత 2 సంవత్సరాలుగా భర్త మద్యం సేవించి వచ్చి భార్యను దూషించడంతో పాటు కొడుతూ, అనుమానిస్తూ వేధింపులకు గురి చేసేవాడు. దీంతో ఆమె మనస్థాపానికి గురై తన ఇంట్లోనే చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడటం జరిగింది. కేసును ఎటపాక సిఐ కన్నపరాజు ఆధ్వర్యంలో కూనవరం ఇన్చార్జి ఎస్ఐ షేక్ సాధిక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గోదావరిలో యువకుడు గల్లంతు

## మృతదేహం లభ్యం.



**దేవీపట్నం మే 17 ప్రభాతవార్త** :ప్రసిద్ధ గండి పోచమ్మ ఆలయం స్నానాల ఘాట్ వద్ద ఆదివారం విషాద ఘటన చోటుచేసుకుంది. గండేపల్లి మండలం కే.గోపాలపురం గ్రామానికి చెందిన గోపాల సతీష్ (25), తండ్రి నాగేశ్వరరావు, తన స్నేహితులతో కలిసి అమ్మవారి దర్శనానికి వెళ్లారు. దర్శనానికి ముందు గోదావరిలో పవిత్ర స్నానం చేసేందుకు ఇద్దరు స్నేహితులతో కలిసి నదిలోకి దిగగా ప్రమాదవశాత్తు కాలుజారి లోతైన నీటిలో పడిపోయి గల్లంతయ్యాడు. సతీష్ నీటిలో మునిగిపోవడంతో అతని స్నేహితులు, స్థానికులు కేకలు వేస్తూ రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ ప్రవాహం ఎక్కువగా ఉండటంతో అతడు కనిపించకుండా పోయాడు. సమాచారం అందుకున్న దేవీపట్నం ఎస్సై షరీఫ్ ఆధ్వర్యంలో పోలీసులు, ఫైర్ సిబ్బంది, స్థానిక మత్స్యకారులు ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. గంటల తరబడి సాగిన శోధన అనంతరం యువకుడి మృతదేహాన్ని వెలికితీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షరీఫ్ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల రోదనలు అక్కడున్న వారిని కంటతడి పెట్టించాయి.

## 104 సంచార వైద్య సేవలను

# అందించే గ్రామాలు ఇవే

**రాజవొమ్మంగి, మే 17, ప్రభాతవార్త** ఈనెల 18 తేదీ నుండి 23 తేదీ వరకూ గ్రామాల్లో నిర్వహించే ప్రభుత్వ ఉచిత సంచార వైద్యసేవల వివరాలను 104.డి. ఇ. ఓ శ్రీనివాస్ తెలిపారు. 18 సోమవారం చీడిపాలెం, 19 తేదీ మంగళవారం బడదనాంపల్లి, 20 న బుధవారం దాకరాయి, 21న గురువారం దూసరపాము, 22 తేదీ శుక్రవారం మారేడుబాక, 23న శనివారం ఓకుర్తి, ఓగిపాలెం గ్రామాల్లో వైద్య శిభిరాలు జరుగుతాయని వెల్లడించారు.

## చినబొడ్డు హైస్కూల్ విద్యార్థినికి

# మంత్రి మల్లాడి అభినందన.



**తాళ్లరేవు మే 17( ప్రభాతవార్త)-** కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం కోరంగి పంచాయతీ బొడ్డు చిన వెంకటాయపాలెం జడ్పీ హైస్కూల్లో పదవ తరగతిలో స్కూల్ ఫస్ట్ వచ్చిన కర్రీ నేహా శ్రీ ని పుదుచ్చేరి మంత్రి మల్లాడి కృష్ణారావు, ఉదయలక్ష్మి దంపతులు అభినందించారు. నేహా శ్రీ 600కు గాను 562 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థిని ఉన్నత విద్యాభ్యాసం చేసి అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ కొపనాతి దత్తాత్రేయ వర్మ,విద్యార్థిని తల్లిదండ్రులు, బంధువులు పాల్గొన్నారు.

# లోకేష్ పర్యటన షెడ్యూల్ విడుదల

## ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పిలుపు:



**జగ్గంపేట మే 17 (ప్రభాతవార్త)** జగ్గంపేట నియోజకవర్గంలో మంత్రి నారా లోకేష్ పర్యటన ఫైనల్ షెడ్యూల్‌ను టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆదివారం సాయంత్రం రావులమ్మ నగర్ లోని టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఫైనల్ షెడ్యూల్ విడుదల చేశారు. 18.05.2026, సోమవారం రాత్రి 9:00 గంటలకు ఢిల్లీ నుండి రాజమండ్రి మధురపూడి విమానాశ్రయానికి చేరుకుంటారు. రాత్రి 10:00 గంటలకు గండేపల్లి మండలం జెడ్ రాగంపేట, పరిణయ ఫంక్షన్ హాల్ పక్కన ఉన్న లేఅవుట్‌లో బస చేస్తారు.

**19.05.2026, మంగళవారం**

ఉదయం 9:45 గంటలకు జగ్గంపేట గుర్రంపాలెం రోడ్‌లోని రెడ్డి ఆయిల్ ఫామ్ తోటలో పామాయిల్ రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారు. అనంతరం గండేపల్లి మండలం పుష్కర ఎత్తిపోతల పథకంలో భాగమైన తాళ్లూరు లిఫ్ట్‌కు రూ.52 కోట్లతో చేపట్టే మరమ్మత్తు పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం జెడ్ రాగంపేట పరిణయ ఫంక్షన్ హాల్ పక్కన కార్యకర్తలతో ముఖాముఖి సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 5:00 గంటల వరకు ఫోటోషఉట్ కార్యక్రమం ఉంటుంది. సాయంత్రం 5:15 నుండి 6:30 గంటల వరకు జగ్గంపేట మండలం రాజపూడి గ్రామంలో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమాల్లో జగ్గంపేట నియోజకవర్గ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. రచ్చబండ కార్యక్రమంలో ప్రభుత్వ పథకాలు, నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించి లోకేష్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో అడపా భరత్, ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణి బాబు, కందుల చిట్టిబాబు, కొత్త కొండబాబు, పిల్ల చంటిబాబు, బుర్రి సత్తిబాబు, బత్తుల ఎస్ బాబు, యర్రంశెట్టి బాబ్జి, పీల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# 24, 465 పాఠ్య పుస్తకాలు సిద్ధం : ఎంఇఓ

**రాజవొమ్మంగి, మే 17, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండల విద్యాశాఖ కార్యాలయానికి ఆదివారం 24, 465 పాఠ్యపుస్తకాలు చేరాయని యం. ఇ. ఓ. కె. వి. వి. సత్యనారాయణదొర తెలిపారు. జూన్ నుండి ప్రారంభమయ్యే విద్యాసంవత్సరంలో ఒకటో తరగతి నుండి పదో తరగతి వరకూ 98 పాఠశాలలకు పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయని యం. ఇ. ఓ. కె. వి. వి. సత్యనారాయణదొర అన్నారు. పాఠశాల ప్రారంబానికి ముందే సంబందిత ప్రధానోపాధ్యా యులకు అందిస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో యం. ఇ. ఓ లు కె. వి. వి. సత్యనారాయణదొర, టి. సూరయ్యరెడ్డి, సిఆర్పీలు శ్రీనివాస్, విష్ణువర్ధన్, మంగరాజు, సతీష్, ఆది నారాయణరెడ్డి, సిబ్బంది ఏసుబాబు పాల్గొన్నారు



## సోలార్ లైట్లు ఏర్పాటు చేసిన సుహాస్



**కె.గంగవరం, మే 17, (ప్రభాతవార్త):** కె గంగవరం మండలం గంగవరం గ్రామానికి చెందిన నేమాని రామకృష్ణ కుమారుడు సుహాస్(ఎన్నారై) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పి 4 పథకంలో భాగంగా సొంత గ్రామ అభివృద్ధిలో తన వంతు సహాయ సహకారాలు అందించాలనే లక్ష్యంతో సోలార్ లైట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పంచాయతీ సమ్మతితో సుమారు 20 సోలార్ లైట్లు ప్రజలకు అందుబాటులో ఉండే ప్రదేశాలలో ఏర్పాట్లు చేసినట్లు వారి కుటుంబ సభ్యులు నేమని రామకృష్ణ, హరికృష్ణ లు తెలియజేశారు. సుమారు లక్షా నలభై వేలు వెచ్చించి ఈ సోలార్ లైట్లు ఏర్పాట్లు చేసినందుకుగాను గ్రామ ప్రజలు ధన్యవాదములు తెలిపారు.

## వార్డుల పునర్విభజన జాబితా విడుదల




**రామచంద్రపురం మే 17 (ప్రభాతవార్త):** పట్టణ పురపాలక సంఘం ఆధ్వర్యంలో వార్డుల పునర్విభజన జాబితాను అధికారులు ఆదివారం విడుదల చేశారు.కమిషనర్ కె.వి.ఆర్ రాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జాబితాను విడుదల చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జనాభా లెక్కల ఆధారంగా వార్డులను పునర్విభవించామని తెలిపారు.గతంలో 28 వార్డులు ఉండేవని, ప్రస్తుతం డీలిమిటేషన్ ఆధారంగా 32 వార్డులుగా విభజించి వార్డుల సరిహద్దులను నిర్ణయించినట్లు అధికారులు వెల్లడించారు.దీనిపై అభ్యంతరాలు, సలహాలు,సూచనలు ఇవ్వాల్సిన వారు.. ప్రకటన జారీ చేసిన వారంలోగా లిఖితపూర్వకంగా పురపాలక కార్యాలయంలో అందించాలని తెలిపారు.వార్డుల పునర్విభజన జాబితాను పురపాలక కార్యాలయంలో బహిరంగంగా నోటీసు బోర్డుతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు అతికించారు.ఈ కార్యక్రమంలో టీపీఓ వి.శేషగిరి,సిబ్బంది పాల్గొన్నారు.

## సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ




**కె గంగవరం, మే 17,(ప్రభాతవార్త):** గంగవరం మండలం ప్రముఖ పుణ్యక్షేత్రమైనటువంటి కోటిపల్లి గ్రామం శ్రీ రాజరాజేశ్వరి సమేత ఛాయా సోమేశ్వర స్వామి ఆలయం వద్ద సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం,రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశాలు మేరకు సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించబడుతున్నట్లు గొడవర్తి రామకృష్ణ చౌదరి, వెంటూరి వీరరాఘవ చౌదరి తెలిపారు. వేసవి తాపానికి దాహం తీర్చే ఆలోచనతో ఈ కార్యక్రమం సుమారు ఐదు రోజుల నుండి జరుగుతున్నట్లు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఇందుకుగాను యాత్రికులు భక్తులు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## ట్రాక్టర్ ఢీకొని యువకుడి దుర్మరణం



**అడ్డతీగల, మే17, ప్రభాతవార్త** అడ్డతీగల మండలం భీముడుపాకల గ్రామం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది ప్రమాద వివరాల్లోకి వెళితే మండలంలోని బంధంవారిపాకల గ్రామానికి చెందిన బంధం గంగరాజు (23) అనే యువకుడు కాలినడకన తన ఇంటికి వెళు ఒడగా అడ్డతీగల వైపు వస్తున్న ట్రాక్టర్ ఢీ కొనడం జరిగింది. ఈ ప్రమాదంలో గంగరాజుకు తలకు తీవ్రమైన గాయాలు కావడంతో, అతడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న అడ్డతీగల పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అడ్డతీగల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదంపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. యువకుడి మృతితో బంధంవారిపాకల గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి .

## గుర్తుతెలియని వ్యక్తి మృతి



**దేవరపల్లి, మే 17 ( ప్రభాతవార్త)** ఆదివారం మధ్యాహ్నం సుమారు 4:00 గంటల సమయంలో, గ్రీన్ ఫీల్డ్ హైవే మీద వాదాలగుంట - యాదవోలు శివారు ప్రాంతంలో సుమారు 65 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని మగ వ్యక్తి చనిపోయినట్లు,ప్రాథమిక విచారణలో, తీవ్ర ఎండ కారణంగా డీహైడ్రేషన్ వల్ల మృతి చెంది ఉండవచ్చునని, . ఈ వ్యక్తి గురించి ఎవరికైనా సమాచారం ఉన్నా లేదా గుర్తుపట్టినట్లయితే, సమాచారం ఇవ్వవలసిందిగా సిఐ నాగేశ్వర్ నాయక్, 9440796584, ఎస్ ఐ మనోహర్ 9440796624 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

### రేలా ఉత్సవాల కోసం ఊరంతా ఒక్కటై

# చలో రంపచోడవరం నినాదం



**వి.ఆర్.పురం,మే17, ప్రభాతవార్త** రంపచోడవరంలో ఈ నెల 24,25,26 తేదీలు మూడు రోజులపాటు, ఆదివాసీ గిరిజన సంఘం (ఎజిఎస్) ఆధ్వర్యంలో జరుగనున్న రేలా ఉత్సవాల కోసం ఆదివారం సున్నంవారిగూడెం గ్రామంలో ఊరంతా ఒక్కటై, ఆట, పాటలతో చలో రంపచోడవరం నినాదం చేశారు. ఈ సందర్భంగా సీనియర్ ప్రజా నాట్యమండలి కళా కారులు ఆసు.లక్ష్మయ్య, సి.హెచ్.సుబ్బారావు, అచ్చుతరావుల ఆధ్వర్యంలో కళా ప్రదర్శనలు, గాన భజన నిర్వహించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆ సంఘం సీనియర్ నాయకులు సున్నం.రాజులు, ఎంపిటిసి పూనెం. ప్రతీఫ్ కుమార్ లు మాట్లాడారు. రంపచోడవరం జిల్లా కేంద్రమైన తరువాత ప్రప్రథమంగా గిరిజన సంస్కృతి, సాంప్రదాయాల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించ తలపెట్టిన రేలా ఉత్సవాల్లో పాల్గొవటానికి ఊరూర, ఇంటింట కదలాలని పిలుపు నిచ్చారు. రేలా ఉత్సవాల విశిష్టతను నేటి తరం యువతి, యువకులు, విద్యార్థులకు వారు వివరించారు. ఈ ఉత్సవాల ద్వారా ఆదివాసీ గిరిజన జాతి సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచారాలు, కట్టుబాట్లను భావితరాలకు అందించాల్సిన అవసరం మనందరిపై ఉందని వారు గుర్తు చేశారు. ఉత్సవాల తొలిరోజు 24 వ తేదీన జరిగే ఆదివాసీ మహా ప్రదర్శన - బహిరంగ సభ చరిత్రలో నిలిచిపోవాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కారం.లక్ష్మి, మాజీ ఎంపిపి సున్నం.నాగమ్మ, మాజీ ఎంపిటిసి సున్నం.పార్వతి, ఆదివాసీ గిరిజన సంఘం, దాని అనుబంధ ప్రజా సంఘాల నాయకులు గొర్రె.రాజు, పొడియం.శ్రీరామూర్తి, చిచ్చడి.బాబురావు, పంకు.సత్తిబాబు, కారం.సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

### సర్పవరం గ్రామ దేవత నేరెళ్ళమ్మ తల్లి

## ఆలయంలో భారీ చోరీ

**తాళాలు పగులగొట్టి సుమారు 14 లక్షలు విలువ చేసే ఆభరణాలు తో దుండగులు పరార్**





**కాకినాడ రూరల్, మే 17 (ప్రభాతవార్త):** కాకినాడ రూరల్ మండలం సర్పవరం గ్రామ దేవతగా పూజలు అందుకుంటున్న నేరెళ్ళమ్మ తల్లి ఆలయంలో శనివారం రాత్రి భారీ చోరీ జరిగింది. గుడి తాళాలు పగలగొట్టి సుమారు రూ .14 లక్షల రూపాయలు విలువచేసే వెండి , బంగారు ఆభరణాలను దుండగులు అపహరించి పోయారు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు సర్పవరం ఇన్స్పెక్టర్ సిహెచ్ ప్రకాష్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని సందర్శించి తనిఖీలు చేపట్టారు. గుర్తు తెలియని దుండగులు సీసీ కెమెరా ఫుటేజ్ తో సహా అపహరించినట్లు పోలీసులు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. దొంగతనాల పట్ల గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని అపరిచితులు, అనుమానస్పదంగా ఎవరైనా సంచరిస్తే పోలీసులను సంప్రదించాలని గ్రామస్తులను కోరారు. దొంగల కోసం పోలీసులు రెండు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు.

### బిజెపి జిల్లా అధ్యక్షులు బుల్లి కొండలు దొరని మర్యాదపూర్వకంగా కలిసిన ఎటపాక మండల బిజెపి నాయకులు



**ఎటపాక: మే 17 ( ప్రభాత వార్త):** నూతన జిల్లా ఏర్పడ్డ తర్వాత పోలవరం జిల్లాకి మొట్టమొదటి భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులుగా నియమితులైన ఈక. బుల్లి కొండలు దొర ని ఎటపాక బిజెపి మండల అధ్యక్షులు నలజాల. శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలు నుండి సంఘం పార్టీలో నిరంతరంగా పనిచేసిన వ్యక్తిని గుర్తించి జిల్లా అధ్యక్షులుగా ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బుల్లికొండలు దొర గఆధ్వర్యంలో జిల్లాలో పార్టీని బలోపేతం చేయదానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని వారు తెలియజేశారు, బిజెపి పార్టీలో కష్టపడి పని చేసిన వారికి ఎప్పటికీ సముచిత స్థానం ఉంటుందని వారు తెలియజేశారు. ఈ క్రమంలో యువ మోర్చా నాయకులు మూడే సతీష్ కుమార్ నాయక్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి రవి కుమార్(గాంధీ), ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు గంధం జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

### మాజీ మునసుబు వెంకటేశ్వర్లు కుటుంబానికి పలువురు పరామర్శ..



**అంబాజీపేట, మే 17, (ప్రభాతవార్త):** మండలంలోని తొండవరం గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు,మాజీ మునసుబు మద్దింశెట్టి వెంకటేశ్వర్లు (75) కుటుంబ సభ్యులను ఆదివారం పలువురు పరామర్శించారు. ఆరోగ్యంతో బాధపడుతున్న వెంకటేశ్వర్లు ఈనెల 16న మృతి చెందారు. వెంకటేశ్వర్లుకు భార్య సత్యవేణి, కుమారులు వీర వెంకట సత్యనారాయణ,పుల్లయ్య నాయుడు,మల్లిబాబు,ఒక కుమార్తె ఉన్నారు. వీరిని పరామర్శించి వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ అరిగెల సూరిబాబు, పీకే రావు, పేరాబత్తుల నాగేశ్వరరావు, ఏడిద నాగబాబు,పేరాబత్తుల రాజు, కేబుల్ చిన్న తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

### ఘనంగా బొడ్డు వెంకటరమణ చౌదరి జన్మదిన వేడుకలు



**సీతానగరం, మే 17, (ప్రభాతవార్త) :** మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం టీడీపీ జిల్లా అధ్యక్షులు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. స్థానిక గీత థియేటర్ ప్రాంగణంలో టీడీపీ మండల అధ్యక్షుడు గెడ్డం తిమ్మారావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వలవల రాజా, ఓబిలినేని కృష్ణ చైతన్య, కాండ్రు శేఖర్, గద్దె వెంకట కృష్ణ చౌదరి, వేగి శ్రీనివాస్, సంగన చినపోసియ్య, మండ రాంబాబు, పుక్కాల శ్రీనివాస్, రాపాక వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కారం కోరుతూ

# ఆర్టీసీ ఈయూ ఉద్యోగుల నిరశన

## 2వ రోజు సంఘీభావం తెలిపిన యునైటెడ్ వర్కర్స్ యూనియన్



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి. మే17,ప్రభాతవార్త.**
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ 2వ రోజు గేట్ మీటింగ్ నిర్వహించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం ఎర్ర బాడ్జీలు ధరించి విధులకు హాజరైన ఉద్యోగులు మధ్యాహ్నం భోజన విరామ సమయంలో గ్యారేజ్ గేట్ వద్ద సమావేశమై తమ డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. మూడోవ రోజు కూడాఎర్ర బాడ్జీలు ధరించి విధులకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ జోనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.వి.ఎస్ నారాయణ మాట్లాడుతూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహాశక్తి పథకం సమర్థవంతంగా అమలు కావాలంటే రాష్ట్రవ్యాప్తంగా కనీసం 3 వేలు కొత్త బస్సులు వెంటనే అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని వారు కోరారు. ఉద్యోగులకు ఈహెచ్ఎస్ ద్వారా నాణ్యమైన వైద్య సేవలు అందడం లేదని, పాత రిఫరల్ విధానాన్ని పునరుద్ధరించి మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.యూనియన్ కార్యదర్శి మేడిది శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న కొత్త డి.ఏలు, ఐ.ఆర్ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. 11వ, 12వ పీఆర్సీ కమిషన్లను నియమించి ఉద్యోగుల వేతన సమస్యలను పరిష్కరించాలని కోరారు. టైం డ్యామేజ్ పేరుతో ఉద్యోగులపై చేస్తున్న రికవరీలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కాలం చెల్లిన పాత టైర్ల కారణంగా ప్రమాదాల ముప్పు పెరుగుతోందని, వెంటనే కొత్త టైర్లు సరఫరా చేయాలని అన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న నైట్ హాల్ట్ అలవెన్సులను చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తామని యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. ప్రభుత్వానికి ఉద్యోగుల ఆవేదన చేరే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ గేట్ మీటింగ్‌లో జిల్లా నాయకులు ఎం.డి. రజాక్, అమలాపురం డిపో, కార్యదర్శి జంగా నాగేశ్వరరావు, కల్వకొలను ప్రసాద్, గ్యారేజ్ కార్యదర్శి ఎ. శ్రీనివాసరావు నువ్వు పాల్గొనగా ఈ నిరసన కార్యక్రమానికి యునైటెడ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గణపతి , డిపో అధ్యక్షులు ఆర్.యన్. రావు తదితరులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో యూనియన్ సభ్యులు, ఉద్యోగులు హాజరై ఈ యు సభ్యులకు సంఘీభావం తెలిపారు.

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ



తెలుగు జాతీయ దినపత్రిక వార్త

### వేసవి విజ్ఞాన తరగతులలో

## విద్యార్థులతో పుస్తక సమీక్షలు ..



**ఆత్రేయపురం, మే ,17,(ప్రభాత వార్త).** వేసవి విజ్ఞాన తరగతులలో భాగంగా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఆత్రేయపురం, పేరవరం, గ్రంథాలయల నందు ఆదివారం గ్రంథాలయ అధికారులు టి. నమశ్శివాయ,శ్రీదేవి నిర్మల ఆధ్వర్యంలో చదవడం మాకిష్టం కార్యక్రమం, నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని16వరోజు తరగతులు విద్యార్థులకు గ్రంధాలయం సభ్యులు దుర్గా ప్రసాద్ కుందేలు చెప్పిన నీతి కథలు వివరించారు. రామారావు తెలుగు వ్యాకరణం బోధించారు..విద్యార్థులతో పుస్తక సమీక్షలు చేయించారు. విద్యార్థులు శతక పద్యాలు చక్కగా రాగయుక్తంగా పాడారు . అదేవిదంగ జీవన నైపుణ్యాలు వివరించారు తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. సిబ్బంది వందన సమర్పించారు.

### వెలి బాధితుల నుంచి

## వివరాల సేకరణ

**తాళ్లరేవు మే 17 (ప్రభాతవార్త)-** మండలం పోలే కుర్రు పంచాయతీ తోటపేట గ్రామంలో వెలి వేశారన్న బాధితుల నుంచి సాంఘిక సంక్షేమ శాఖ ఏ.ఎస్. డబ్ల్యూ.ఓ. యాళ్ళ వాణి, ఎస్సీ హాస్టల్ వార్డెన్ చిట్టి బాబు, ఇతర అధికారులు ప్రసాదబాబు, శేషుకుమార్, వర్మ లు తోటపేట బాధితులని కలసి వివరాలు సేకరించారు. బాధితులు జనిపల్లి బ్రహ్మయ్య, పెయ్యల సత్యనారాయణ, వూడా కనకరత్నం, సాధనాల శివరామ కృష్ణ, ప్రసాద్, జనిపల్లిఈశ్వరరావు, పెయ్యాల శ్రీనివాస్, సత్తిబాబు పాల్గొన్నారు.

### ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలపై

## సతీష్ రావు ఫైర్



**రామచంద్రపురం మే 17 (ప్రభాతవార్త):** తమిళనాడు డి.ఎం.కె పార్టీ ఎమ్మెల్యే ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలు కోట్లాది హిందువుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసే విధంగా ఉన్నాయని కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి సతీష్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని నిర్మూలించడం ఎవరి తరం కాదు అంటూ వ్యాఖ్యానించిన ఆయన, హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా రాజకీయ నాయకులు మాట్లాడకూడదని హెచ్చరించారు.భారతదేశ సంస్కృతి,సంప్రదాయాలు,ఆధ్యాత్మిక విలువలకు అవమానించే విధంగా మాట్లాడటం అత్యంత బాధాకరమని సనాతన ధర్మాన్ని గౌరవించే ఒక హిందువుగా ఖండిస్తున్నానని సతీష్ రావు తెలిపారు.రాజకీయ ప్రయోజనాల కోసం మత విశ్వాసాలను టార్గెట్ చేయడం సరైన విధానం కాదని ఆయన అన్నారు.ప్రజాస్వామ్య దేశంలో ప్రతి మతాన్ని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యతని ఆయన తెలియజేశారు.బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఇలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని వెంటనే ఉదయనిధి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని సతీష్ రావు స్పష్టం చేశారు.ఎమ్మెల్యే ఉదయనిధి హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.ఏకాత్మ మావతావాదం సిద్ధాంతంతో దేశ ఐక్యత,సమగ్రతను కాపాడే విధంగా,రాజకీయ ప్రయోజనాలు ఆశించకుండా ఒక ఆలోచన,దృక్పదంతో అన్ని మతాలను గౌరవించే విధంగా ముందుకు వెళ్తున్న భారతీయ జనతాపార్టీ కార్యకర్తలు దేశ ఐక్యతను,సామరస్యాన్ని దెబ్బతీసే ఇలాంటి వ్యాఖ్యలను మేము తీవ్రంగా ఖండిస్తున్నామని సతీష్ రావు తెలిపారు.

### బాటసారుల దాహార్తిని తీర్చేందుకు

## చలివేంద్రాలు దోహదం

**వాసవి క్లబ్ ప్రెసిడెంట్ సిద్దు**



**శంఖవరం మే 17 ప్రభాతవార్త** బాటసారులు ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయని వాసవి క్లబ్ ప్రెసిడెంట్ కొత్త సిద్దు పేర్కొన్నారు మండలంలోని కత్తిపూడి యూనియన్ బ్యాంకు ఎదురుగా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ చలి వేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ మాట్లాడుతూ తీవ్ర ఎండల మధ్య ప్రయాణికులకు తాత్కాలిక ఉపశమనం కలిగించాలన్న సంకల్పంతో ఈ కేంద్రం ద్వారా మజ్జిగ పంపిణీ కొనసాగుతోంది అని అన్నారు. వేసవికాలంలో వాహనదారులు, ప్రయాణికులు ఎండలో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. వారికి ఉపశమనం కలిగించేందుకు క్లబ్ ద్వారా మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం శుభ పరిణామం అని పేర్కొన్నారు .గ్రామంలోని బ్యాంకుల సమీపంలో ఈ కేంద్రం ఏర్పాటు చేయడంతో రోజుకు వందలాది మంది సేవలు పొందుతుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ మురళి ట్రెజరర్ కట్ట బసవయ్య వెంకట సత్యనారాయణ గణేష్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps